క్లుప్తంగా

రవన్న ఆశయాలను కొనసాగిద్దాం



రవన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు మజీద్ మియా, గోపాల్, ప్రేమరాజు, వెంకటేశ్వరగౌడ్, గోవిందు, ఆటో కార్మికులు, పాల్గొన్నారు.

వైఎస్సార్ వీరాభిమాని మృతి



యేసురత్నం (ఫైల్)

ఆత్మకూరు రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వీరాభిమాని, వైఎస్సార్‌సీపీ కార్యకర్త కరివేన గ్రామానికి చెందిన గద్ద యేసురత్నం(80) ఆదివారం మృతి చెందారు. ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం వరకు కాంగ్రెస్ పార్టీ అభిమానిగా ఉన్నారు. తనకు 2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధాప్య పింఛన్ మంజూరైనప్పటికీ నిరాకరించారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే పింఛన్ తీసుకున్నారు. తన స్వంత ఖర్చులతో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. కాగా గద్ద యేసురత్నం మృతికి వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శిల్పా చక్రపాణి రెడ్డి, సమన్వయ కర్త భువనేశ్వరరెడ్డి సంతాపం తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య

నందికొట్కూరు: పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి వి. దివ్య సూచించారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ గురించి పల్లెలు, మారుమూల గ్రామాల ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. గ్రామాల్లోని పేదలకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షులువెంకటరాముడు, సీనియర్ న్యాయవాదులు రఘునాథరెడ్డి, మద్దయ్య పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎఫ్ఐఆర్ గురించి, న్యాయ వ్యవస్థల గురించి క్లుప్తంగా వివరించారు.

భగవద్గీత చదవడం అలవాటు చేసుకోవాలి



ఎం.లింగాపురంలో త్రైతసిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవడం అలవాటు చేసుకోవాలని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక చింతలపల్లి, ఆత్మకూరు కమిటీల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసులు సూచించారు. సోమవారం మండలంలోని ఎం.లింగాపురం, గోకవరం గ్రామాల్లో ఇంటింట పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతన ఏర్పాడాలంటే ప్రతి ఒక్కరూ భక్తితో భగవద్గీతను పఠించాలన్నారు. అజ్ఞానం తొలగి జ్ఞానవంతులవుతారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంజీవ, పార్థసారథి, చక్రపాణి, మనోహర్, నాగమద్దిలేటి, శేషన్న, భాస్కర్, పార్వతమ్మ, వెంకటేశ్వరమ్మ, నాగలక్ష్మి, మరియమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన కృష్ణా మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వినాయకస్తుతి, ఆనంద నర్తన గణపతి, మహేశ్వరి మహాకాళి, కాలభైరవాష్టకం, నమశివాయతే తదితర గీతాలకు హర్షిత, శ్రీజ, ఆరా ధ్య, ప్రతీక, ఆధ్య, లలితాకృత్తిక, అక్షర, చతుర, ఉదయ తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

దిష్టిబొమ్మల్లా గోదాములు

- జూపాడుబంగ్లా, పారుమంచాలలో ప్రారంభానికి నోచుకోని గోదాములు
- ధాన్యం నిల్వచేసుకునే వెసులుబాటులేక ఇబ్బందుల్లో రైతులు



పారుమంచాలలో వృథాగా ఉన్న గోదాము



జూపాడుబంగ్లాలో ప్రారంభానికి నోచుకోని బహుళ ప్రయోజన గోదాము

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమార్థం జూపాడు బంగ్లా, పారుమంచాల గ్రామాల్లో నిధులు వెచ్చించి నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు ప్రారంభానికి నోచుకోక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. రైతులు పండించిన పంటలను ఆయా గ్రామాల్లోనే భద్రపరుచుకునేందుకు వీలుగా బహుళ ప్రయోజన గోదాములను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించింది. పారుమంచాల గ్రామంలో రూ.75 లక్షలు వెచ్చించి 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము, మండ్లెం గ్రామానికి రూ.45 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము మంజూరు కాగా అక్కడ స్థలం లేక దాన్ని జూపాడుబంగ్లాలో నిర్మించారు. గోదాముల నిర్మాణం ఏడాది గడిచినా నేటికీ వాటిని ప్రారంభించలేదు. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు సరైన వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు గోదాములను ప్రారంభిస్తే రైతులు రబీలో పండించిన ధాన్యాన్ని నిల్వచేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

గోదాములను అందుబాటులోకి తేవాలి



జూపాడుబంగ్లాలో నిర్మించిన గోదామును వెంటనే ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తేవాలి. నేను ఏటా ఆరు ఎకరాల్లో పలురకాల పంటలు సాగుచేస్తాను. పండించిన ధాన్యాన్ని ఇంట్లో నిల్వచేసుకునేందుకు స్థలం లేక ఉన్న రేట్లకే నష్టమో, లాభమో విక్రయిస్తుంటాను. ధాన్యం నిల్వచేసుకునేందుకు స్థలం ఉంటే గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వచేసుకునే అవకాశం ఉంటుంది. బంగ్లాలో నిర్మించిన గోదామును వెంటనే ప్రారంభించి రైతులు పండించిన ధాన్యం నిల్వచేసుకునే వెసులుబాటు కల్పించాలి.

– మధు, రైతు, జూపాడుబంగ్లా

మా చేతుల్లో ఏమీ లేదు



జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల్లో నిర్మించిన గోదాముల నిర్మాణం పూర్తికావటంతో వాటిని కాంట్రాక్టర్లు మాకు అప్పగించారు. గోదాముల ఓపెనింగ్ ఎప్పుడు మా చేతుల్లో ఏమీ లేదు. ప్రభుత్వ ఆదేశాలు వస్తే గోదాములను ప్రారంభించి రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు అవకాశం కల్పిస్తాం.

– చంద్రశేఖర్‌గౌడు, సీఈఓ, 80 బన్నూరు సహకారసొసైటీ

మొక్కుబడిగా విజిలెన్స్ తనిఖీలు

జూపాడుబంగ్లా: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పోతులపాడు, చాబోలు గ్రామాల్లో మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పారుమంచాల గ్రామంలో ఆరుగురు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా వారిని వదిలిపెట్టడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయం

ఆత్మకూరు: పట్టణ, గ్రామీణ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వంగా అదనంగా ఆర్థిక సాయం అందజేస్తుందని హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్టీ చెంచులకు రూ.లక్ష వరకు ప్రభుత్వం అదనంగా అందజేయనున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు తమ కుల, ఆదాయ పత్రాలను, భార్య, భర్తల ఆధార్‌కార్డు, గ్రామీణ లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్ జిరాక్స్‌లను సంబంధిత సచివాలయంలో వార్డు అమినిటీస్ సెక్రటరీకి, ఇంజినీర్ అసిస్టెంట్‌లకు అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సావిత్రీబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శం



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పాములపాడు: మహిళలకు సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శమని ఆయుర్వేద వైద్యాధికారిణి సావిత్రమ్మ అన్నారు. సోమవారం స్థానిక పూలే అంబేడ్కర్ గ్రంథాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సావితమ్మ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా మహిళలను ప్రేమించి విద్యను బోధించిన తొలి ఉపాధ్యాయిని అని అన్నారు. ఆమె అడుగుజాడల్లో ప్రతి మహిళా నడవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి కృష్ణారెడ్డి, గ్రంథాలయ ఇన్‌చార్జ్ అబ్రహాం, ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, మోహన్, నాగరాజు, వినోద్, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సావిత్రీబాయిపూలే

నందికొట్కూరు: సావిత్రీబాయిపూలే పేదల చదువుల తల్లి అని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి వర్ధంతిని నిర్వహించారు. పలువురు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు సావిత్రీబాయిపూలే అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాగరాజు సుధాకర్, వడ్డే సుధాకర్, రామకృష్ణ, మూర్తుజాబీ, వెంకటలక్ష్మమ్మ, రమణమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిన అంగన్‌వాడీలు



తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

పాములపాడు: అంగన్‌వాడీల డిమాండ్ల సాధన కోసం సోమవారం రాష్ట్ర రాజధానిలో చేపట్టిన మహాధర్నాకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తరలి వెళ్లారు. మండలంలో పాములపాడు సెక్టార్‌లో 25, వేంపెంట సెక్టార్ లో 26 చొప్పున అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో ఒక టీచర్, ఒక ఆయా విధులు నిర్వహిస్తున్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 866 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోకపోవడంతో పిల్లలందరూ ఇళ్ల వద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేతనాలు పెంచాలనేది ప్రధాన డిమాండ్‌గా వారు చెబుతున్నారు. ఎన్నికల ముందు మినీ సెంటర్లను మెయిన్‌సెంటర్లుగా మారుస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం, కేవలం గ్రాట్యూటీ అమలు చేస్తామని, పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచుతామని ఇటీవల ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. కేవలం వయస్సు పెంచుతూ మాత్రమే జీఓ ఇచ్చారని, మిగతా హామీలు నెరవేర్చకపోవడంపై మహాధర్నా తలపెట్టినట్లు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. కాగా ధర్నాకు వెళ్లకుండా సెక్టార్ సమావేశం నిర్వహించేందుకు ఉన్నతాధికారులు నోటీసులు అందజేసినట్లు అంగన్‌వాడీలు ఆరోపించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయి ఉత్పత్తులు ప్రదర్శిస్తున్న దృశ్యం

వెలుగోడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రదర్శనకు ఉంచిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సోమవారం ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏఓ పవన్‌కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ వెలుగోడు, వేల్పనూరు గ్రామ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన కూరగాయలు, ఆహార ఉత్పత్తులు వినియోగానికి అందుబాటులో ఉన్నాయన్నారు. రసాయన రహిత ఆహార ఉత్పత్తుల వినియోగంతో దీర్ఘకాలిక ఆరోగ్యం సమస్యలను తగ్గించి, ఆరోగ్యం పెంపొందించుకోవచ్చన్నారు. వ్యవసాయ భూములు కలిగిన రైతులు విశిష్ట సంఖ్య గుర్తింపు కార్డు కోసం రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

పంట నమోదు వివరాలు సరిచూసుకోండి

రబీ సీజన్‌కు సంబంధించి మండలంలో 3,707 మంది రైతులు 10,890 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. ఈ-పంట నమోదు చేసి జాబితాను సోమవారం రైతు సేవ కేంద్రంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాను సరిచూసుకోవాలన్నారు. ఏవైనా తప్పులు ఉంటే ఆధారాలతో రైతు సేవ కేంద్రం సిబ్బందికి అర్జీ అందజేసి సరిచేసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులు తర్వాత ఈనెల 22న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు.

18 వరకు ప్రజాచైతన్య యాత్రలు

బండిఆత్మకూరు: ఈనెల 18వ తేదీ వరకు తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించనున్నామని సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు, నాగరత్నం తెలిపారు. సోమవారం వారు మండల పరిధిలోని పార్నపల్లి గ్రామ పరిధిలోని జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం శిల్పా నగర్‌లో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నాటుసారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

పాములపాడు: గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి, పవన్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓను కలిసి నవోదయం కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించడంలో సహాయం అందించాలన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్‌లో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాలు.. రైతులకు టార్పాలిన్ పట్టలు విక్రయిస్తూ జీవనం సాగించే శ్రీనివాసులు కుటుంబం గ్రామంలోని సత్రంలో తలదాచుకుంటోంది. ఎప్పటిగానే ఆదివారం రాత్రి భోజనానంతరం నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి శ్రీనివాసులు మెలుకువ వచ్చి చూడగా తన దిచక్రవాహనం(మోపెడ్) కనిపించకపోవడడంతో రాత్రంతా గ్రామంలో గాలించాడు. ఆచూకీ లేకపోవడంతో ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. తనకు గ్రామానికి చెందిన పెద్ద ఇడ్లీ అలియాస్ శివపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్‌కుమార్ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ తిరుపాలు

నందికొట్కూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు సూచించారు. సోమవారం మండల పరిధిలోని వడ్డేమాన్ జెడ్పీ హైస్కూల్‌లో మహిళా సాధికారత అంశంపై విద్యార్థినులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఎస్ఐ ఈ పాఠశాలను దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల్లో దాగి ఉన్న ప్రతిభాను వెలికి తీసేందుకు మహిళా దినోత్సవం పురస్కరించుకుని పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు దేశ ప్రధానులుగా, ముఖ్యమంత్రులుగా, రాష్ట్రపతులు అయ్యారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జుబేదా, విద్యా కమిటీ చైర్మన్ మహమ్మద్ హుసేన్, సభ్యులు స్వాములు, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, పీడీ రాజేశ్వరిదేవి పాల్గొన్నారు.

నకిలీ పట్టాలు రద్దు చేయాలి



రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: స్థానిక మారుతీనగర్, బీఆర్‌ఆర్ నగర్, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్, బీఎస్ఎస్ఆర్ నగర్‌లోని నకిలీ పట్టాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెంటనే రద్దు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ ఇంటి స్థలాల పట్టాలు సృష్టించి అమాయకులకు విక్రయించి మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. 15 ఏళ్ల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న అర్హులైన పేదలకు పట్టాలిచ్చి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో పార్టీ నాయకులు డక్క కుమార్, షేక్ అశు, రహంతుల్లా, లక్ష్మీదేవి, గౌసాబీ, శాంతమ్మ, చంద్రలీల, ఎస్తేరమ్మ, కాసీం, సుబ్బమ్మ, శాలిబీ, రాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంపై ఆరా

పాములపాడు: మండలంలోని కోల్స్ ఆనందాపురం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంపై తహసీల్దార్ సుభద్రమ్మ సోమవారం అక్కడికి చేరుకుని ఆరా తీశారు. దగ్ధమైన పూరి గుడిసెను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితులు కోరగా.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

కులధ్రువీకరణ పత్రాలివ్వాలి



మాట్లాడుతున్న బేడ బుడుగ జంగం నాయకులు పరిగె సుంకన్న

నందికొట్కూరు: బేడ బుడగ జంగం కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకుడు పరిగె సుంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వేసిన జేసీ శర్మ కమిషన్ విచారణలో బుడగ జంగాల ఆచార పద్ధతులు వేరుగా ఉన్నాయని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా పరంగా, అభివృద్ధి పరంగా వెనకబడి ఉన్నారని గుర్తించిందన్నారు. కమిషన్ నివేదికను బట్టి అప్పటి ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 25న అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లి తమ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు మురళి, రామలింగం, శ్రీనివాసులు, బాలస్వామి, ఆంజనేయులు, పెద్దస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



ఉపాధి కూలీలతో నాయకులు

పగిడ్యాల: ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడంతోపాటు ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ కోరారు. సోమవారం మండలంలోని బీరవోలు గ్రామ పరిధిలో ఉపాధి కూలీలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారికి అనుకూలమైన వారికి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు కట్టబెట్టేందుకు ఉన్నవారిని వేధింపులకు గురి చేస్తుండడం తగదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నాగేశ్వరరావు, హనుమన్న, చిన్న నరసింహ, మంగమ్మ, వరలక్ష్మి, పద్మావతి, సరోజమ్మ, ఆంజనేయులు, మద్దిలేటి ఉన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

శ్రీశైలంప్రాజెక్ట్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు కాశమ్మ, పి.వి.రమణమ్మ, జయమ్మ, వరలక్ష్మి, బసవేశ్వరి, లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం సున్నిపెంట తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనలు చేస్తున్న తమను అప్పటి ప్రతిపక్ష పార్టీ నాయకులు తమను పరామర్శించి తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా తమ సమస్యలను పట్టించుకోవడం తగదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు డి.ఓబులయ్య, పులిరాజు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లకు చేరిన పది ప్రశ్నాపత్రాలు



ప్రశ్నాపత్రాలను జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లోకి తీసుకెళ్తున్న అధికారులు

జూపాడుబంగ్లా/కొత్తపల్లి/బండి ఆత్మకూరు: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సోమవారం పోలీసుస్టేషన్లకు చేరాయి. ఆరు సబ్జెక్టులకు సంబంధించి సెట్-1 ప్రశ్నాపత్రాలు పటిష్ట బందోబస్తు మధ్య అధికారులు పోలీసుస్టేషన్లకు చేర్చారు. ఆయా మండలాల్లోని పరీక్ష కేంద్రాల నిర్వాహకులు ప్రశ్నాపత్రాలను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్లలో భద్రపరిచారు. కాగా జూపాడుబంగ్లా మండల కేందంలో 430 మంది, కొత్తపల్లి మండల కేంద్రంలో 291 మంది, బండి ఆత్మకూరు మండల కేంద్రంలో 580 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

పాపములపాడు: మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు టైలరింగ్‌లో 45 రోజులు(రోజుకు 8గంటలు), 60 రోజులు(రోజుకు 6గంటలు), 90 రోజులు(రోజుకు 4 గంటలు) ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు https://apobmms.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహిళా చైతన్యాన్ని నీరుగార్చుతున్న కార్పొరేట్లు

ఆత్మకూరు: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఆర్భాటం చేస్తూ కార్పొరేట్లు మహిళా ఉద్యమ చైతన్యాన్ని నీరుగార్చుతున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. సోమవారం వారు స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సీఐటీయూ ఉపాధ్యక్షులు రణధీర్, రైతుసంఘం మండల అధ్యక్షులు మాబాషా, శ్రామిక మహిళలు ఇందిరమ్మ, జ్యోతి, శాంతి, సామక్క, లక్ష్మీబాయి, సుజాత, వరలక్ష్మి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.